## ఇంత అన్యాయమా!

# భూస్వాహాను 'చట్ట'బద్ధం చేయడమా!

పాలకులు 'అభివృద్ధి' ఆకలి మీద ఉన్నారు. ఈ ఆకలి తీరడానికి వారికి భూమి కావాలి. పదీ పరకా కాదు, లక్షల ఎకరాలు కావాలి. ఇదీ అదీ అని కాదు, సముద్రతీరమైనా, అటవీ ప్రాంతమైనా, ఏడాదికి మూడు పంటలు పండే భూమయినా ఏదయినా సరే అది ఏదో ఒక రకంగా వారి కైవసం అయితీరాలి. కేంద్రంలోని బి.జె.పి ప్రభుత్వమయితే మరో అడుగు ముందుకు వేసి ఏకంగా చట్టాన్నే ప్రతిబంధకంగా భావించి, సవరణల ద్వారా దానికి నిలువెల్లా తూట్లు పొడవడానికి సిద్ధమయింది. మొదట దొడ్డిదారిన ఆర్డినెన్సు తెచ్చింది. తర్వాత పార్లమెంటులో సవరణ బిల్లు పెట్టింది. ఆర్డినెన్సు మీద అన్ని విమర్శలు వచ్చినా కించిత్తు కూడా మార్పులు చేయకుండా దాన్నే బిల్లుగా ప్రవేశపెట్టిందంటే ప్రభుత్వం ఎంతగా బరితెగించిందో అర్థమవుతోంది. కార్పొరేట్ల ప్రయోజనాలు వారికి ఎంత ముఖ్యమో అర్థమవుతోంది. ఎన్నో ఉద్యమాల ఫలితంగా యుపిఎ ప్రభుత్వం 2013లో తెచ్చిన 'భూసేకరణ, పునరావాస ప్రక్రియలలో పారదర్శకత, న్యాయమైన నష్టపరిహార హక్కు చట్టాన్ని' అమలు చేయకుండానే మళ్లీ 120 సంవత్సరాలు వెనక్కి తీసుకెళుతోంది.



బ్రిటిష్ కాలంనాటి 'భూసేకరణ చట్టం-1894' నే భారత ప్రభుత్వాలు కూడా అమలు చేస్తూ వచ్చిన కారణంగా పేద రైతులు, కూలీలు, మత్స్యకారులు, దళితులు, ఆదివాసులు ఇప్పటికే చాలా పెద్దఎత్తున నష్టపోయారు. వివిధ ప్రాజెక్టులు, పరిశ్రమలు కట్టేందుకు గత ఆరు దశాబ్దాలలో దాదాపు ఆరుకోట్ల మంది మూల్యం చెల్లించవలసి వచ్చింది. వీరిలో ఐదోవంతు మందికి కూడా ఇప్పటికీ సరయిన పునరావాసం లభ్యం కాలేదు. బ్రిటిష్ కాలంనాటి ఆ చట్టాన్ని మార్చమని ఎన్నో ఉద్యమాలు డిమాండ్ చేస్తూ వచ్చాయి. గత 16 ఏళ్లుగా సాగుతున్న నర్మదా బచావో ఆందోళన్ ఆ చట్టం ప్రాతిపదికనే ప్రశ్నిస్తూ, అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యంతోపాటు ప్రజల జీవించే హక్కుకు సంబంధించిన ఎన్నో అంశాలను చర్చకు పెట్టింది.

**ఎంత విచిత్రమో చూడండి! ప్రజాభీష్టాన్ని ప్రతిఫలించే చట్టం రావడానికి 120 ఏళ్లు పడితే దానిలోని ప్రజాస్వామిక అంశాలను తొలగించడానికి ఏడాది కూడా పట్టలేదు.**

కాశీపూర్, కళింగనగర్, సింగూర్, నందిగ్రామ్, నియంగిరి, పోస్కో, సోంపేట ఉద్యమాలు కూడా అభివృద్ధి పేరుతో జరుగుతున్న రకరకాల అన్యాయాల్ని గత పదేళ్లుగా ప్రశ్నిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గత యు.పి.ఏ. ప్రభుత్వం 'భూసేకరణ చట్టం – 1894'ను సమీక్షించి కొత్త శాసనాన్ని తయారు చేసింది. దీని పేరే 'భూసేకరణ, పునరావాస ప్రక్రియలలో పారదర్శకత, న్యాయమైన నష్టపరిహార హక్కు చట్టం–2013' (Right to Fair Compensation and Transparency in Land Acquisition, Rehabilitation and Resettlement Act-2013).



## నష్టపరిహారం ఒక హక్కు

ఈ చట్టంలో న్యాయమైన పరిహారాన్ని మొట్టమొదటి సారిగా ఒక హక్కుగా గుర్తించారు. అలాగే భూసేకరణ అంశాన్నీ, పునరావాస, నష్టపరిహార అంశాన్నీ ఇది మొదటిసారిగా కలిపి చూసింది. పాత చట్టంలోని ప్రజా వ్యతిరేక అంశాలన్నింటినీ తొలగించకపోయినా ప్రజా ఉద్యమాలు సూచించిన కొన్ని అంశాలను స్వీకరించింది. వాటిలో ముఖ్యమైనవి :

★ ఇకపై ప్రజల, గ్రామ సభల సమ్మతి లేనిదే భూసేకరణ జరపరాదు. ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు భూమిని సేకరించే పక్షంలో 80 శాతం స్థానికుల సమ్మతినీ, ప్రభుత్వ – ప్రైవేటు భాగస్వామ్య సంస్థలకు భూమిని సేకరించే పక్షంలో 70 శాతం మంది అంగీకారాన్నీ పొందడం తప్పనిసరి.

★ ఏదయినా ప్రాజెక్టును చేపట్టే ముందు 'సామాజిక ప్రభావ అంచనా'ను (Social Impact Assesment - SIA) విధిగా నిర్వహించాలి. అసలు భూసేకరణ ప్రజాప్రయోజనం కోసమేనా, విస్థాపనకు గురయ్యే కుటుంబాలు ఎన్ని, జీవనాధారం కోల్పోయేవారి సంఖ్య ఎంత, సేకరణకు ఎంచుకున్న భూవిస్తీర్ణం ఎంత, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు వాటిల్లే నష్టం ఎంత వంటి అంశాలను కూడా అందులో భాగంగా అధ్యయనం చేయాలి. అంతే కాదు భూసేకరణ కారణంగా నష్టానికి గురి కాగల ప్రజా జీవనంలోని ప్రతి ఒక్క అంశాన్నీ – అంటే నీటి వనరుల నుంచి పారిశుధ్య వ్యవస్థ వరకూ, విద్యాలయాల నుండి ఆసుపత్రుల వరకూ, చౌకదుకాణాల నుండి గిడ్డంగుల వరకూ – పరిగణనలోకి తీసుకోవాలి. ప్రాజెక్టు మూలంగా సిద్ధించే ప్రయోజనాన్నీ, కలగగల నష్టాన్నీ గణించి లాభనష్టాలను బేరీజు వేయాలి. 'పర్యావరణ ప్రభావ అంచనా' (Environmental Impact Assessment) ను కూడా నిర్వహించాలి.

★ బహుళ పంటలు పండే వ్యవసాయ భూములను సేకరించకూడదు. ఈ నిబంధనను చేర్చడం వలన ఆహార భద్రతకు ఒకింత భరోసా ఇచ్చినట్టయింది. భూయజమానులకే కాక ఆ భూమి ఆసరాతో జీవిస్తున్న ప్రజలకు కూడా నష్టపరిహారం ఇవ్వాలి.

★ భూసేకరణలో అక్రమాలకూ, అవినీతికీ పాల్పడినా; పునరావాసం కల్పించడంలో నిర్లక్ష్యానికి పాల్పడినా సంబంధిత ప్రభుత్వ అధికార్లపై కేసులు పెట్టి విచారించి తగు శిక్ష విధించాలి.

★ భూసేకరణ ప్రక్రియ పూర్తి అయిన 5 సంవత్సరాల లోపు నిర్దేశిత ప్రాజెక్టు పని మొదలు కాకపోతే ఆ భూమిని తిరిగి మునుపటి యజమానికి అప్పగించాలి.

ఈ చట్టం జనవరి 2014లో అమలులోకి వచ్చింది. అయితే వెనువెంటనే కేంద్రంలోనూ, కొన్ని రాష్ట్రాలలోనూ ఎన్నికలు రావడం వల్ల చాలా రాష్ట్రాలలో దీని అమలుకు సంబంధించిన నిబంధనల రూపకల్పన జరగలేదు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం సైతం ఆ పని చేయలేదు సరికదా, అధికారం చేపట్టగానే చట్టసవరణకు పూనుకుంది. పార్లమెంటులో చర్చకు పెట్టకుండానే, సమావేశాలు ముగిసిన మరుసటి వారంలోనే దానిపై హడావుడిగా ఆర్డినెన్సు తెచ్చింది. యు.పి.ఏ. ప్రభుత్వం చేసిన చట్టంలో చాలా లోపాలు వున్నాయని, భూసేకరణ ప్రక్రియ సులభంగా లేదని, దానివల్ల దేశాభివృద్ధికి కావలసిన

పారిశ్రామీకరణ, మౌలిక వసతుల రూపకల్పన ఆలస్యం అవుతాయని, విదేశీ పెట్టుబడిదారులు ఈ చట్టంలోని అంశాలు చూసి పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రారని ప్రచారం చేసి ఆర్డినెన్సు తేవడాన్ని సమర్థించుకుంది. ఇప్పుడు పార్లమెంటులో బిల్లు పెట్టి అవే వాదనలు వినిపిస్తూ ఉంది.

విచిత్రమేమిటంటే నేటి లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ఛైర్‌పర్సన్‌గా ఉన్న ఆనాటి స్టాండింగ్ కమిటీ చేసిన సూచనలకు పూర్తి విరుద్ధంగా బి.జె.పి. ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను, తర్వాత బిల్లును రూపొందించింది. ఎందరో అభాగ్యుల ఆర్తనాదాల్లోంచి, ప్రజా ఉద్యమాల అలుపెరగని ఆందోళనల నుంచి పుట్టుకొచ్చిన ఈ చట్టం ప్రజలకు కాసింత ఉపశమనం ఇవ్వక ముందే దాన్ని సంపూర్ణంగా మార్చివేయడం చూస్తే ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తోందో స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

2013 చట్టంలో ప్రజలకు అనుకూలంగా ఉండిన అన్ని అంశాలను మొదట ఆర్డినెన్స్, తర్వాత బిల్లు ద్వారా నీరుగార్చారు. పాత బ్రిటిష్ చట్టంలోని అంశాలనే మళ్లీ ముందుకు తీసుకువచ్చారు. కొత్త చట్టంలోని అత్యంత ముఖ్యమైన అంశాలను - సామాజిక ప్రభావ అంచనా, ఆహార భద్రత పరిరక్షణ, భూసేకరణకు మెజారిటీ ప్రజల ఆమోదం ఉండితీరాలనే ప్రజాప్రయోజనకరమైన వాటన్నింటినీ తొలగించారు. దేశభద్రత, దేశరక్షణ, గ్రామీణ మౌలిక సదుపాయాల రూపకల్పన, పేదలకు గృహనిర్మాణ ప్రాజెక్టులకు మినహాయింపు ఇచ్చారంటే అర్థం చేసుకోవచ్చు కాని పారిశ్రామిక కారిడార్లు, ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో కూడుకున్న ప్రాజెక్టులన్నిటికీ కూడా మినహాయింపులు ఇవ్వడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. అంటే ఏ పరిమితులు లేకుండా స్వేచ్ఛగా అన్నిరకాల ప్రాజెక్టులకు భూసేకరణ చేసుకోవడమే వాళ్ల ఉద్దేశం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే జాతీయ, అంతర్జాతీయ కార్పొరేట్ కంపెనీలు చౌకగా భూమిని కాజేసే అవకాశాన్నీ, వేగవంతంగా ప్రభుత్వం చేత భూసేకరణ జరిపించుకునే సౌకర్యాన్నీ ఈ ఆర్డినెన్సు కల్పించింది. అదే ఇప్పుడు చట్టం కాబోతోంది.

**ప్రజాభిప్రాయ సేకరణకు చెల్లుచీటీ**

'ఏ ప్రాజెక్టుకైనా ఆ ప్రాంత ప్రజల అనుమతి తప్పనిసరి' అన్న ప్రజాస్వామిక సూత్రాన్ని సవరించకపోతే

తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే చాలా విషయాలలో పరస్పరం పేచీ పడుతున్నా 2013 చట్టానికి సంబంధించి వారు చేసిన నిబంధనలు మాత్రం ఒకదానికొకటి నకలుగా ఉన్నాయి. నిబంధనలు రూపొందించడంలో రెండు ప్రభుత్వాలూ ప్రజాసంఘాలను సంప్రదించాలనుకోలేదు. భూములు కోల్పోయే వారికి చట్టంలో వున్న హక్కులను తమ శక్తిమేర కుదించేశారు. ఇద్దరూ సాంఘిక ప్రభావ అంచనా ఊసెత్తలేదు. వ్యవసాయ భూమిని ఇతర అవసరాలకు మళ్లించే విషయంలో - మొత్తం సాగు విస్తీర్ణంలో 15% మించకూడదని తెలంగాణ ప్రభుత్వం పరిమితి విధించింది గాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం ఎటువంటి పరిమితినీ విధించలేదు. అంతేకాకుండా ప్రైవేటు వ్యక్తులు లేదా కంపెనీలు నేరుగా రైతుల దగ్గరనుండి 5000 ఎకరాల వరకు భూమిని కొనుగోలు చేసే వెసులుబాటును కూడా కల్పించింది. తెలంగాణ ప్రభుత్వం ఒకింత 'ఉదారం'గా దాన్ని 2000 ఎకరాలకు పరిమితం చేసింది. ఈ రకం వెసులుబాటు ఇతర రాష్ట్రాలలో లేదు. పైగా అలా సేకరించిన భూమి భూసేకరణ చట్టం పరిధిలోకి రాదని చెప్పారు. ఆ భూములపై ఆధారపడ్డ వ్యవసాయ కార్మికులు, ఇతర ప్రజలు తీవ్రంగా నష్టపోవలసిందే. నూతన రాజధాని-నవ్యాంధ్ర నిర్మాణం కోసం ఒకరు, బంగారు తెలంగాణ కోసం ఇంకొకరు కూడబలుక్కున్నట్లు ప్రజల హక్కులను వీలైనంతగా కుదించి, కార్పొరేట్ కంపెనీలకు ద్వారాలు తెరుస్తున్నారు. అంటే బి.జె.పి. ప్రభుత్వం ఆర్డినెన్సు (ఇప్పుడు బిల్లు) తీసుకురాకముందే 2013 భూసేకరణ చట్టానికి తూట్లు పొడవడానికి ఇద్దరూ సిద్ధమైపోయారు.

విచ్చలవిడిగా భూసేకరణ చేసే వీలుండదని భావించబట్టే బి.జె.పి. ప్రభుత్వం ఆ క్లాజులను తీసేస్తూ ఈ ఆర్డినెన్సు (ఇప్పుడు బిల్లు) తీసుకొచ్చింది. దీని ప్రకారం ప్రైవేటు రంగ సంస్థలకైనా, ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం వున్న ప్రాజెక్టులకైనా ఇకముందు భూమిని సేకరించేటప్పుడు ప్రజల ఆమోదం అవసరం లేదు. ఉదాహరణకు లక్షా అరవై వేల ఎకరాలలో ప్రతిపాదిస్తున్న విశాఖ-కాకినాడ కోస్టల్ కారిడార్ కోసం కూడా ప్రజాభిప్రాయం తీసుకోనక్కరలేదని ప్రభుత్వం చెప్పగలదు. ఇంతకు మించిన అన్యాయం మరొకటి వుండదు.

**సామాజిక ప్రభావ అంచనా**

ఒక ప్రాజెక్టును ప్రారంభించేముందు 'సామాజిక ప్రభావ అంచనా'ను చేపట్టడం వల్ల అక్కడి ప్రజల జీవనం, సంస్కృతి, ఆస్తులు, మౌలిక సదుపాయాలు వంటి అనేక అంశాలపై ప్రాజెక్టు ప్రభావం ఎలా ఉండబోతుందో తెలుస్తుంది. ప్రాజెక్టుకయ్యే వ్యయంతోపాటు ప్రజలకు కలిగే నష్టాన్ని కూడా అంచనా వేసి అది ఎంతవరకు ప్రజా ప్రయోజనాన్ని కలిగించగలదో గణిస్తారు. ఈ ప్రక్రియ వల్ల లాభనష్టాలను వాస్తవికంగా బేరీజు వేయవచ్చు. 2013 చట్టానికి ఇది వెన్నెముక లాంటిది. కాని కార్పొరేట్ కంపెనీలకు ఇది చాలా పెద్ద ఆటంకం గనక ఈ అంచనా ప్రక్రియను ఆర్డినెన్సు ద్వారా పూర్తిగా నిలిపివేసారు.

**ఆహార భద్రతకు తూట్లు**

నీటివసతి కలిగి, బహుళ పంటలు పండే భూములను మరీ అత్యవసరమైన, గత్యంతరం లేని స్థితిలో మాత్రమే తీసుకోవాలనే షరతును కూడా ఈ ఆర్డినెన్సు ద్వారా తొలగించారు. అంటే వ్యవసాయ భూములను ఇతర అవసరాలకు వాడుకోవడానికి అనుమతి ఇచ్చారు. ఇది ముందుముందు ఎటువంటి ప్రమాదాన్ని తెచ్చిపెడుతుందో ఊహించడం కష్టం కాదు. వ్యవసాయమే జీవనాధారంగా వున్న వివిధ వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోవడమేగాక ఆహార కొరత ఏర్పడడం తథ్యం.

**భూదందాకు మార్గం సుగమం**

దేశంలో మెరుగైన విద్య, ఆరోగ్య రక్షణకు వసతులు కల్పించాలనే సాకుతో ప్రైవేటు ఆసుపత్రులను, విద్యా

> ఎందరో అభాగ్యుల ఆర్తనాదాల్లోంచి, ప్రజా ఉద్యమాల అలుపెరగని ఆందోళనల నుంచి పుట్టుకొచ్చిన ఈ చట్టం ప్రజలకు కాసింత ఉపశమనం ఇవ్వక ముందే దాన్ని సంపూర్ణంగా మార్చివేయడం చూస్తే ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తోందో స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

సంస్థలను కూడా ప్రజాప్రయోజనాల జాబితాలో చేరుస్తూ మరొక సవరణ చేశారు. ఇది ప్రజల సంక్షేమం కోసమేనని పైకి అనిపించినా ఆసుపత్రులు, విద్యాసంస్థల పేరుతో కార్పొరేట్ సంస్థలకు వేల ఎకరాల భూమిని కట్టబెట్టడానికేననేది సుస్పష్టం. కొద్దిపాటి భూములను ఆయా అవసరాలకు వాడి, మిగిలిన వాటిని వాణిజ్య అవసరాలకు వినియోగించుకునే అవకాశం కూడా ఆర్డినెన్సు ద్వారా కల్పించారు.

భూసేకరణలో అక్రమాలకు, అవినీతికి పాల్పడే అధికార్లపై కేసులు పెట్టి విచారించడానికి సంబంధిత ప్రభుత్వ అనుమతిని ఆర్డినెన్సు తప్పనిసరి చేసింది. దీనివల్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయడం అటుంచి తప్పుడు అధికార్లకు రక్షణ దొరుకుతుంది.

ఇలా ఒకటి తర్వాత ఒకటి ప్రజలకు అనుకూలమైన అంశాలన్నిటినీ తొలగించుకుంటూ పోయి, 2013 చట్టానికి వెన్నెముకగా నిలిచిన పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం, ప్రజాప్రయోజనం అనే విలువలకు అర్థం లేకుండా చేసింది బి.జె.పి ప్రభుత్వం. అసలు 2013 చట్ట లక్ష్యాన్నే పూర్వపక్షం చేస్తూ ఈ ఆర్డినెన్సు తీసుకొచ్చారు. ఇప్పుడు దాన్నే చట్టబద్ధం చేసే ప్రయత్నంలో ఉన్నారు. కార్మిక చట్టాలకు, పర్యావరణ పరిరక్షణ చట్టాలకు ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న సవరణలతో ఈ ఆర్డినెన్సు లేదా బిల్లును కలిపి చూస్తే దేశ ప్రజలకు పొంచివున్న పెను ప్రమాదాన్ని స్పష్టంగా చూడగలుగుతాం.

ఇంతటి అప్రజాస్వామిక, అమానవీయ, అహంకార పూరితమైన ప్రభుత్వ ఆలోచనను, చర్యను నిలువరించకపోతే ప్రజలకూ ప్రజాస్వామ్యానికీ మనుగడ ఉండదు. ఎట్టి పరిస్థితిలోనూ ఈ ఆర్డినెన్సు చట్టరూపం దాల్చకుండా అందరం కలిసి ఉద్యమిద్దాం.

**మానవహక్కుల వేదిక**

Human Rights Forum (HRF)

27-2-2015

ప్రచురణ కర్తలు : **ఎస్. జీవన్ కుమార్** - 98489 86286, **వి.ఎస్. కృష్ణ** - 94404 11899